# అనుభవం

పన్నంరాజు సుందరరావు



ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వర్షం.

దాదాపు అరగంట గడిచాక దానికి గాలి తోడయింది. ఉరుములు మెరుపులతో అంతకంతకు విజృంభిస్తోంది కాని తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు.

వానా-గాలీ-

ఈ రెండూ సహనాన్ని చంపేస్తూంటే నేనూ వున్నానంటూ సంధ్య వెలుగుని మింగేసి చిక్కబడి పోతుంది చీకటి.

సారధి తలదాచుకున్న ఆ యింటి వరండాలో మరీ చిక్కగా వుంది చీకటి. వరండాలోకి వర్షపుజల్లుని విసిరికొడుతోంది పెనుగాలి.

సారధి బట్టలు సగానికి పైగానే తడిసాయి. లెదర్ సూట్‌కేస్ తడవకుండా గోడమూలకి పెట్టి అడ్డంగా నిలబడ్డాడు విసుక్కుంటూ.

చీకటిగా చిత్తడిగా వున్న వరండా, జోరుతగ్గని గాలివాన, తడిసి ఒంటికి అంటుకుపోయిన బట్టలూ, సారధిలో చిరాకును పెంచుతున్నాయి. చేసేదేంలేక ఆ పరిస్థితిని తిట్టుకుంటూ ఎదురుగా చూస్తూ నిలబడిపోయాడు.

ఆ యింటికి ఎదురుగావున్న రావి చెట్టూ, దానికి ఇరుపక్కలా వున్న తుప్పలూ, డొంకలూ గాలివానకి అల్లల్లాడిపోతున్నాయి. ఇంటి ముందున్న కంకర రోడ్డుని కాలవగా మార్చి, వింత శబ్దాలు చేస్తూ నీరు పల్లానికి పారిపోతోంది. చీకట్లో అవన్నీ మసకమసగ్గా కనిపిస్తున్నా

మెరుపుల వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

చాలాసేపు గడిచాక విసుగ్గా టైం చూసుకున్నాడు సారధి.

ఏడూ-నలభై.

గాఢంగా నిట్టూర్చి వరండాకి అటు వేపు చూశాడు. మెరుపు మెరిసినప్పు డలా వరండా అంతటినీ పరిశీలనగా చూస్తూనే వున్నాడు. వరండాని బట్టి ఆ యింటి ప్లాన్‌ని కొంతవరకూ అంచనా వేసుకున్నారు. ఇల్లు అంత పెద్దది కాదు. వరండాకి అటువేపు ఓ గదీ, ఇటువేపు ఓ గదీ, ఈ గది నానుకుని వీధికొట్టూ- రెండుగదుల మధ్య నున్నది హాలు- అయి వుండొచ్చు-హాల్లోంచి గాని- ఇలా వీధి కొట్లోంచిగాని బయటకు వెళ్ళొచ్చు వీటన్నిటినీ కప్పుతూ పైన డాబావుంది ఆలోచిస్తూ తనకి అందుబాటులో వున్న వీధికొట్టు తలుపుల్ని ఓసారి నెట్టిచూశాడు. అప్పుడు తనకొచ్చిన ఆలోచనకి నవ్వుకుంటూ తన వెనకవున్న గది కిటికీ గజాల్లోంచి వేళ్ళు పోనిచ్చి తలుపుల్ని నెట్టి చూశాడు. అవీ మూసేవున్నాయి. ఆ యింట్లో ఎవరైనా ఉన్నారో లేదో- ఉంటే ఈ రాత్రికి కాస్త లోపల ఆశ్రయం యిస్తే బావుణ్ణనుకున్నాడు. ఎన్నడూ ఎరగని ఈ మారుమూల పల్లెటూళ్లో ఈ భీభత్స నిశీధిలో ఇలా ఒంటరిగా తెల్లారేవరకూ నిలబడిపోయి కాలక్షేపం చెయ్యడం కష్టమేననిపించింది సారధికి. ఆ పరిస్థితి, ఆరాటం సారధిని వరండాకి అటువేపు నడిపించాయి. అక్కడి కిటికీతలుపులు మూసివున్నాయి. గాలివాన హోరులో లోపలినుంచి ఏ అలికిడీ వినిపించలేదు. కిటికీ తలుపు సందులోంచి సన్నని వెలుగురేఖ దూసుకొస్తోంది తప్ప మొహం దగ్గరపెట్టి చూసినా లోపల ఏమున్నదీ స్పష్టంగా కనిపించడం లేదు. ఉస్సురంటూ యధాస్థానంలోకి వచ్చి నిస్సహాయంగా నిలబడిపోయాడు. వర్షం కాస్త శాంతిస్తున్నట్టు కనిపిస్తోంది- కాని ఉధృతం ఒగ్గలేదు.


క్షణాలు దొర్లిపోతున్నకొద్దీ సారధిలో సహనం చచ్చిపోతోంది. ఇంటినుంచి బయలుదేరినందుకు తనని తాను తిట్టుకున్నాడు. దార్లో చెడిపోయిన బస్సునీ, తన పెళ్లికి కనీసం పదిహేను రోజులు ముందుగానైనా వస్తేగాని వీల్లేదని పట్టుబట్టి ఉత్తరాలురాసి వేధించిన స్నేహితుణ్ణీ తిట్టుకున్నాడు.'వీడి పెళ్లిమాటెలా వున్నా ప్రస్తుతం నా పెళ్లి జరిగిపోతోంది ఇక్కడ' అనుకున్నాడు ఉక్రోషంగా. అంతలోనే ఏదో ఆలోచనవచ్చి 'ఛీ ఛీ తన పెళ్లి ఎన్నడూ జరగదు. తనా బంధంలో చిక్కుకోడు.' అనుకున్నాడు మళ్లీ.

ముప్పైఏళ్లు దాటిన సారధికి రెండు మూడేళ్ల క్రితంవరకూ పెళ్లి చేసుకోవాలనీ దుర్భరమైన ఒంటరితనాన్ని దూరం చేసుకోవాలనీ ఆశించాడు. సారధి

అందం, సంస్కారం, హుందాతనం, ఉద్యోగం చూసి ఆ కాలంలో చాలామంది తమ పిల్లల్ని చేసుకోమంటూ వెంటాడి వేధించారు. పెళ్ళిచూపులకంటూ ఏ స్నేహితుల్నో సాయంచేసుకుని వెళ్ళడం- అమ్మాయిల్ని చూడడం- తీరా చూశాక వాళ్ళ మనసుకి నచ్చకపోవడం-అందు వల్ల జరిగే వృధాఖర్చులూ, శ్రమ, ఆ అమ్మాయిల తల్లితండ్రులు పదే పదే వచ్చి విసిగించడం, స్నేహితుల, సాటి ఉద్యోగస్తుల వెటకారాలూ-ఇవన్నీ పెళ్లి చూపులంటే అసహ్యాన్ని కలిగించాయి సారధికి. బంధువులందరూ మనిషితోలు కప్పుకున్న రాక్షసులని తల్లీతండ్రీ వున్నప్పుడూ, వాళ్ళు పోయాకా అనుభవపూర్వకంగా తెలుసుకున్న సారధి తమ పిల్లల్ని చేసుకోమంటూ బంధువులు పన్నిన రకరకాల ఉచ్చుల్లో ఇరుక్కోలేదు. తన చుట్టూ తిరిగి వెకిలివేషాలేసి తనని వల్లో వేసుకోడానికి ప్రయత్నించిన యువతుల వల్ల ఆడవాళ్ళంటే అసహ్యం, ఎక్కడ ఎవర్ని చూసినా తనకి అన్నివిధాలా నచ్చిన అమ్మాయి కనిపించక పెళ్ళంటే పూర్తిగా అసహ్యం, విముఖత ఏర్పడిపోయాయి. ఇంక జీవితంలో పెళ్లిమాట తలపెట్ట కూడదని తీర్మానించేసుకున్నాడు. సాధ్యమైతే బ్రహ్మచారిగానే బతుకంతా గడిపేద్దామని దృఢంగానిశ్చయించుకున్నాడు.

వర్షంజోరు మళ్లీ హెచ్చింది. జల్లు మరోసారి వరండానీ, సారధినీ తడిపేసి వెళ్లింది. మరో అరగంట గడిచాక ఇంక అలిసిపోయినట్టు ఒక్కసారిగా వాన వెలిసింది. గాలి విజృంభిస్తూనే వుంది. సారధి టైం చూసుకున్నాడు. తొమ్మిది దాటింది. చలిచలిగా వుంటే ఇంక భరించలేక హాలు తలుపువేపు ఒక్క అడుగువేసి అంతలోనే ఆగిపోయాడు. ఆ ద్వారం దగ్గరకు వెలుగొచ్చినట్టనిపించింది. తలుపు సందులోంచి సన్నగా బయటకొస్తోంది వెలుగు. మరుక్షణంలో ఆ తలుపులు తెరుచుకున్నాయి. మళ్లీ ఓ తలుపు దభాల్న మూసుకుంది. లాంతర్ని ఆ తలుపు వెనకవుంచి వరండాలో కొచ్చింది ఆమె. లాంతరు వెలుగును దాటేలోగా చూసిందాన్ని బట్టి ఆమె రూపాన్ని ఊహించుకుంటూ పరీక్షగా ఆమెనే చూస్తూండిపోయాడు సారధి.

ఆమె వరండా అటువేపు చివరిఅంచు వరకూ వెళ్లి ఆ పక్కకి మొహంపెట్టి "జానకమ్మా-జానకమ్మా" అంటూ ఎవర్నో పిలిచింది. ఆమె అలా పిలుస్తూంటే ఎక్కడో శ్రావ్యంగా కోయిల కూస్తున్నట్టు మధురగానం వింటున్నట్టు అనిపించింది సారధికి. ఆమె మరో రెండుసార్లు పిలిచాక ఆ పక్కకి, ఆమె దగ్గరగా ఎవరో వచ్చి "దానికి నడుం పట్టేసిందమ్మా, లేవలేకపోతోంది. బాగుంటే యీ సరికి తమ యింటి కొచ్చేసేదే. తమరేం కంగారు పడకండి. నేను మేలుకునే వుంటాను. అవసరమైతే కేక




వెయ్యండి. పంతులుగోరు ఎప్పుడు వస్తారమ్మా" అన్నాడు.

రేపు ఉదయంగాని సాయంకాలంగాని వస్తారు తాతా. అన్నం తిన్నదా జానకమ్మ ?"

"తింది తల్లీ."

"సరే నువ్వెళ్లు - మళ్లీ వర్షం వచ్చేట్టుగా వుంది. ఏదేనా అవసర మయితే పిలుస్తాలే "

"చిత్తం."

ఆమె తిరిగివస్తూ గుడ్డి వెలుగులో ఆ మూలనిలబడిన సారథినిచూసి గతుక్కు-మంటూ గుమ్మందగ్గర తక్కున ఆగి పోయి "ఎవరది ?" అంది. ఆమెగొంతు కాస్త వణికినా గంభీరంగా వుంది. లాంతరు వెలుగు ఆమె ఎడమభాగాన్ని స్పృశిస్తోంది. ఆమాత్రం వెలుగులోనే ఆమె అద్భుత సౌందర్యరాసి అని గ్రహించాడు సారథి. తెల్లని బట్టలో వెలిగిపోతున్న ఆమెను చూస్తూంటే గొంతు పెగలడంలేదు సారథికి. అంత లోనే ఆమె మళ్లీ అరిచింది "ఎవరు మీరు" ఈసారి ఆమె గొంతులో వణుకు లేదు.గంభీరంగా కాస్త కరుకుగా వుంది.

"నేనండీ" అనేసి ఆగిపోయాడు సారథి. ఇంకా గబగబా తనను గురించి చెప్పేసుకోవాలని ఆతృతగా వున్నా, గొంతు పెగలక వశంకాలేదు.

ఆమె చివాలున లాంతరు అందుకుని పైకెత్తి పట్టుకుని సారథికేసి పరిశీలనగా చూసింది. రేగిన జుట్టుతో, తడిసిన బట్ట లతో చేష్టలుడిగి నిలబడిపోయిన సారథి ఆమెకి మర్యాదస్తుడిలాగే కనిపించాడు. అందగాడు, సంస్కారవంతుడు అని మొదటి చూపులోనే గ్రహించిందామె. రెండుక్షణాలు అలా చూసి గాలికి లాంతరు ఆరిపోయేలావుంటే దాన్ని యధాస్థానంలో వుంచి మళ్లీ సారథివేపు చూసింది.

ఎలాగో సారథి కాస్త తేరుకున్నాడు.

"నా పేరు సారథి- బెంగుళూర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా ఫ్రెండ్ వాడి

పెళ్ళికి రమ్మని బలవంతంచేస్తే బయల్దేరాను; రైలు ప్రయాణం బాగానే జరిగింది. రైలు దిగాక బస్‌లో వెళ్లాలి ఆ వూరు. దారిలో బస్ చెడిపోయింది. కొంతసేపు గంటాలుపడి ఆ బస్సు సరి బాగవదన్నారు బస్సువాళ్లు. సాయంత్రం అపొక్కటే తప్ప మరే బస్సులూ లేవన్నారు. చాలామంది లారీల్లో వెళ్లిపోయారు. నాకు మాత్రం లారీలో వెళ్లడం శ్రేయస్కరం కాదనిపించింది. బస్సువాళ్లతో బాటు ఆ బస్సులోనే వుండిపోయి రాత్రంతా గడపడంకూడా అంత మంచిదిగా కనిపించలేదు. ఏంచెయ్యాలో తోచక ఆలోచిస్తూంటే-ఈవూరి రైతులు కొందరు బస్ దిగిపోయి వచ్చేస్తూంటే వాళ్లని అనుసరించి వచ్చేసాను. వాళ్లు నాకంటె ముందుగానే వూరుచేరుకున్నారు. ఇంక ఈయిల్లు ఇంకా రెండుఫర్లాంగులుందనగా వర్షం మొదలైంది. గబగబ వచ్చి ముందు తారసపడిన ఈ యింటి వరండాలో తలదాచుకున్నాను. మిమల్ని చూస్తూంటే ఏదీ దాచబుద్ధి కావడంలేదు. -ఈసూట్‌కేస్‌లో కొన్ని విలువైన వస్తువులున్నాయి. డబ్బుకూడా ఎక్కువగానే వుంది. వీటితో ఇక్కడిలా గడపడం శ్రేయస్కరం కాదనిపిస్తోంది. దయచేసి ఈ రాత్రి మీ యింట్లో కాస్త ఆశ్రయం ఇప్పిస్తే తెల్లారగానే వెళ్లిపోతాను. నా గురించి మీరేం సందేహించక్కర్లేదు. నావల్ల మీకే అపకారం జరగదని హామీ ఇస్తున్నాను " అన్నాడు నెమ్మది స్వరంతో.

ఆమె అంతా వింది. కాస్త మనసు కరిగింది. అయినా కొన్ని క్షణాలు ఆలోచించి, "రండి లోపలికి" అంటూ తను ముందు లోనికివెళ్లి లాంతర్ని హాల్లో ఓ స్టూలుమీద పెట్టి తన గదిలోకి వెళ్లింది. అంతవరకూ లోపల ఆశ్రయం కోసం ఆరాటపడిన సారధికి జంకూ, గొంకూ లేకుండా ఆమె లోనికి రమ్మనగానే ఏదో మొహమాటం, బిడియం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. సూట్‌కేస్ అందుకుని తటపటాయిస్తూ నిలబడిపోయాడు. అంతలోనే హోరుమంటూ మళ్లీ మొదలైన వర్షానికి ఉలిక్కిపడి ఒక్క అంగలో హాల్లోకి వెళ్లి తలుపు మూసేసాడు. సూట్‌కేస్ గోడవారగా వుంచి బూట్సు సాక్సు విప్పేసాడు.

ఆమె గదిలోంచి మడత పంచె, తువ్వాలూ తెచ్చి యిచ్చింది.

"ముందు ఆ బట్టలు మార్చుకోండి. తడిబట్టలు ఆ గదిలో దండెంమీద ఆరెయ్యండి. తెల్లారేలోగా కరెంటు రావడమంటూ వుంటే ఫేన్‌గాలికి కాస్తయినా ఆరతాయి" అంది.

"ఇప్పుడివన్నీ ఎందుకండీ నా దగ్గరున్నాయి," అన్నాడు సారధి తడబడుతూ.

"మీదగ్గరుండవనికాదు. ఇప్పుడివన్నీ మీ పెట్లోంచి తీసి వాడడం ఎందుకని" అందామె సన్నగా నవ్వుతూ.

ఆమెకేసి రెండు క్షణాలు చూశాడు సారథి. 'చూసినకొద్దీ చూడాలనిపించే సౌందర్యం' అనుకున్నాడు. ఓ క్షణం అతని కళ్లలోకి చూసి- కళ్లు వాల్చేసింది ఆమె.

బట్టలు అందుకుని సారథి సందేహిస్తుండడం గమనించి, "ఆ గదిలోకివెళ్లి బట్టలు మార్చుకోండి. మీ సూట్ కేస్ కూడా అక్కడే వుంచండి" అంటూ లాంతరు ఆ గదిలో టేబుల్ మీదవుంచి వెళ్లిందామె. హాలు నలువైపులా కలియజూశాడు సారథి. హాలుకి నాలుగు ద్వారాలున్నాయి. రెండు ఇరుపక్కల ఉన్న గదుల్లోకీ, ఒకటి వీధిలోకి, మరొకటి పెరటి వరండాలోకి-గోడలకి రవివర్మ చిత్రాలూ-మరికొన్ని కేలండర్లూ వేలాడుతున్నాయి. హాల్లో రెండు కుర్చీలూ ఓ స్టూలూ తప్ప మరే సామాన్లూ లేవు. వాటిని చూస్తూ గదిలోకి నడిచాడు. సారథి బట్టలు మార్చుకునేసరికి ఆమె హార్లిక్స్ కలిపి తెచ్చింది. "అందాకా ఇది తీసుకోండి. అన్నం వుడగ్గానే వడ్డించి పిలుస్తాను" అని గ్లాసు టేబిల్ మీద వుంచుతూ సారథికేసి చూసింది. తనిచ్చిన పంచెను మడతపెట్టి లుంగీలా కట్టుకుని తెల్లచొక్కా వేసుకున్నాడు. రెండు క్షణాలు అదోలా చూసి చూపు మరల్చుకుంది. "నేను కేవలం ఆశ్రయం ఇస్తే చాలన్నాను. మరింత శ్రమపడతారని తెలిస్తే అవతలే నిలబడిపోయి వుండేవాడిని" అన్నాడు మొహమాట పడుతూ సారథి.

"ఇప్పుడు నేను శ్రమపడిపోతున్నదేమీ లేదండీ ఏదో దారితప్పినట్టు ఇక్కడ చిక్కడిపోయారు. ఈ ఒక్క పూటికి ఈ మాత్రం మర్యాద చెయ్యడం పెద్ద కష్టమేం కాదు" సన్నగా నవ్వుతూ అనేసి వెళ్లిపోయిందామె.

ఆమె వెళుతూంటే ఆ నడకలోని వయ్యారాన్నీ ఆ నడకకి అనుగుణ్యంగా ఊగిసలాడుతున్న వాలుజడనీ గమనిస్తూ హార్లిక్సు అందుకుని తాగేశాడు సారథి. టేబిల్ దగ్గర కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకున్నాడు. మదిలో ఆమె రూపం మెదిలింది. ఎంత నిగ్రహించుకుంటున్నా ఆమె గురించి ఆలోచిస్తూనే వుంది మనసు. కళ్లు ఆమె దర్శనంకోసం తహతహ లాడుతూనే వున్నాయి. కొంతసేపు ఆ అవస్థలో వుండి 'ఛీఛీ ఇదేమిటి' తనమీద తనే విసుక్కుంటూ టేబిల్ మీది పుస్తకాల్లోంచి ఓ ఇంగ్లీషు నవల తీసి చదవడంలో నిమగ్నమయాడు. దాదాపు సగం పుస్తకం పూర్తయ్యేసరికి ఆమె గదిలోకొచ్చింది,

"భోజనానికి లేవండి చాలా ఆలస్యం చేసాను నీళ్లూ సబ్బూ ఆ వరండాలో పెట్టాను. కాళ్లూ చేతులూ కడుక్కుని రండి" అంది పెరటి వరండావేపు చూస్తూ.

ఆమె అలా పిలుస్తూంటే సారథి

మదిలో తీయ్యని ఊహలేవో మెదిలాయి. అలా పిలవడం ఎంతో మధురంగా అనిపించింది. పుస్తకంలోంచి తలెత్తి రెప్ప వాల్చకుండా ఆమె బంగారువన్నె శరీరంలోని అందాల్నీ వంపుసొంపుల్నీ చూశాడు రెండు క్షణాలపాటు. అంతలోనే సంస్కారం అడ్డుపడింది. వివేకం వెన్నుతట్టింది. అతికష్టంమీద చూపు మరల్చుకున్నాడు. "ఇదిగో వస్తున్నా పదండి" అంటూ లేచాడు. ఆమె వంటగదిలోకి నడిచింది.

సారధి వెళ్లి పీటమీద కూర్చున్నాక ఆమె మరో పీటమీద కూర్చుని వడ్డన ప్రారంభించింది. అతను కూర కలుపుకుంటూంటే ఆమె నెయ్యి వేసింది. వంచిన తల ఎత్తకుండా తినసాగాడు సారధి. అతను మొహమాట పడుతున్నాడని గ్రహించి ఖాళీఅవుతున్నవాటిని భర్తీ చేస్తోంది ఆమె. ఆమె అలా వడ్డించడం, తను తినడం-సారధి మనసు మళ్లీ వశం తప్పి, ఏవేవో ఆలోచనలను రేకెత్తించింది. ఆమెతో ఏమైనా మాట్లాడాలనిపించింది. మాట్లాడితే ఆ యింటిగురించీ ఆమెగురించీ కొంతైనా తెలుసుకోవచ్చనిపించింది. ఇంక కుతూహలాన్ని అణుచుకోలేక "ఊ వర్షపురాత్రి ఇంచుమించు ఊరి చివరగా వున్న ఈ యింట్లో ఒంటరిగా ఉండగలుగుతున్న మీ ధైర్యాన్ని మెచ్చుకోలేకుండా వున్నాను. మనిషిని మనిషి పీక్కు-తింటున్న ఈ రోజుల్లో నేనెవరో ఎలాంటివాణ్నో తెలియకపోయినా లోపల ఆశ్రయమిచ్చి భోజనం పెట్టినందుకు ఆశ్చర్యంగానూ ఆనందంగానూ వుంది" అంటూ సంభాషణ ప్రారంభించాడు.

ఆమె సారధికేసి నిశ్చలంగా చూస్తూ మౌనంగా వుండిపోయింది.

సారధి ఆమె కళ్లలోకి చూసాడు సూటిగా. క్షణకాలం ఆమె కళ్లలో నీరు లాంతరు వెలుగులో మెరిసింది. ఆమె రెప్పలార్పి తెరిచి నిట్టూర్చింది.

"మనిషి మనసుకీ-జీవితానికీ-తట్టుకోలేని దెబ్బలు ఒకసారి తగిలాక ఆ తర్వాత ఎన్ని బాధ లెదురైనా భరించడం కష్టమనిపించదనుకుంటాను ఇది మా ఇల్లు. ఇక్కడ నేను భయపడాల్సిన అవసరం లేదు. ఈ పల్లెలో అందరికీ మా నాన్నగారు దైవసమానులు. ఈ యింటిమీద ఈగవాలినా ఈ పల్లె ప్రజల నుంచి తప్పించుకు బతికి బయటపడడం కష్టం. నాన్నగారు అప్పుడప్పుడు పనిమీద పట్నం వెళుతుంటారు. అలాంటప్పుడు ఎన్ని రోజులైనా నేనూ మా తమ్ముడూ ఒకరికొకరు సాయంగా వుంటాం. మా తమ్ముడు తొమ్మిది చదువుతున్నాడు. రాత్రి తొమ్మిది వరకూ చదువుకుని పడుకుంటాడు. మాకు సాయంగా రాత్రిపూట పక్క పాకలో వుండే జానకమ్మ వచ్చి హాల్లో పండుకుంటుంది. దానికి వంట్లో బాగులేదని మీరు వినేవుంటారు. ఆమె



రాకపోయినా ఈరాత్రి మాకు సాయంగా దేముడు మిమల్ని పంపించాడనుకుంటు న్నాను. అంచేత మీవల్ల నాకేం భయం-బెరుకూ కలగడం లేదు; అయినా మీరు హామీఇచ్చారు కూడా" అంది చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ. ఆమె చివరి మాటకి నవ్వుకుంటూ ఆలోచనలో పడ్డాడు సారధి. ఆమె మాటలన్నీ అర్థమైనా 'మనిషి మనుసుకీ-జీవితానికీ తట్టుకోలేని దెబ్బలు'— అనే మాటకి అర్థం బోధపడ లేదు సారధికి. ఏమిటా విఘాతాలు? అనే ప్రశ్న మనసుని వేధిస్తూంటే ఏదో అడుగుదామని తలెత్తి ఆమెకేసి చూశాడు ఆమె కళ్లలో ఏదో చీకటి అఖాతాలు కనిపించాయి సారధికి. ఇంక ఆమె వ్యక్తిగత విషయాలడిగి బాధపెట్టడం సమంజసం కాదనిపించింది. తనకి తెలుసుకోవాలిని వున్నా ఒక రాత్రి తల దాచుకోడానికి వచ్చి ఆ వివరాలు తెలుసు కోవాల్సిన అగత్యం, హక్కు లేదనిపించింది. ఆమెను చూస్తూంటే మనసులో ఏదో బాధ కలుక్కుమంటోంది. "మిమ్మల్ని చాలా బాధపెట్టినట్టున్నాను. మరేం అనుకోకండి ప్లీజ్" అన్నాడు నొచ్చుకుంటూ.

"అబ్బే ఇందులో బాధపడడాని కేముం దండీ ఏదో మీకు తెలీక అడిగారు. నాకు తోచిందేదో వాగేశాను. మీరు కూడా మరేం అనుకోకండి" నవ్వుతూ అని సారధికి పెరుగు వడ్డించింది. భోజనం ముగించి చెయ్యికడుక్కొనివచ్చి "భోజనం అద్భుతంగా వుంది. చాలా ఏళ్ల తర్వాత ఈ రోజు తృప్తిగా తిన గలిగాను" అన్నాడు కృతజ్ఞతగా చూస్తూ సారధి.

"ఏదో హడావిడిగా చేసిన వంట అదే మీకు నచ్చినట్టుంది" అంటూ గిన్నెలు సర్దసాగింది-ఆమె.

ఆమెకేసి ఓ సారి జాలిగా చూసి అక్కణ్నుంచి కదిలాడు సారధి. గది లోకి వెళ్లి పుస్తకం తెరిచాడు.

మరో పదినిముషాలకి ఆమె వచ్చి ఆ గదిలో పందిరపంచంమీది దుప్పటి తీసేసి కొత్తది పరిచి తలగడాలు సర్దింది. మరచెంబుతో మంచినీళ్లూ గ్లాసూ తెచ్చి మంచం తలవేపు వున్న స్టూలుమీద పెట్టింది. "పడుకునే ముందు లాంతరు తగ్గించి పెట్టుకోండి,చీకట్లో పడుకోవద్దు" హెచ్చరిస్తున్నట్లు అని ఆ గది పెరటి వేపు తలుపులు మూసేసి గడియపెడుతూ సారధికేసి చూసింది జవాబుకోసం.

"అలాగే" అంటూ తలూపాడు సారధి.

ఆమె నవ్వి "ఇవ్వాళ మరి కరెంటు రాదు. ఎక్కడో చెట్టుకొమ్మలు పడి తీగలు తెగిపోయి వుంటాయి" అంటూ వెళ్లి విసనకర్ర తెచ్చి మంచంమీదపెట్టి సారధికేసి ఓ సారిచూసి ఆమె గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకుంది.

ఆమె వెళ్లిపోగానే సారధి మనసంతా అదోలా అయిపోయింది.

ఆదరంగా మాట్లాడుతూ ఏ అరమరి కలూ లేకుండా దగ్గరదగ్గరగా మసలుతూ ఎన్నో ఏళ్ల పరిచయమున్నట్టు ఆమె ప్రవర్తించిన తీరు అమితంగా ఆకర్షిం చింది. బట్టలూ, హార్లిక్సూ తెచ్చి ఇవ్వడం, భోజనం పెట్టడం, పక్కవేసి మంచినీళ్లు పెట్టడం తల్చుకుంటూంటే మధురమైన ఊహలెన్నో చెలరేగాయి. బతుకులో లోటు వచ్చినట్టు కన్పించింది. ఆ యింట్లోకొచ్చిన క్షణంనుంచీ అప్పటి వరకూ తను పొందిన అనుభవం పెళ్లి విషయంలో ఏర్పడిన విముఖతని దూరం చేసింది. 'పెళ్లి అసలు వద్దు' అనే దృఢ నిశ్చయాన్ని ముక్కలు చేసింది. 'తను పెళ్లి చేసుకోవాలి' అనుకున్నాడు. 'ఎవర్ని చేసుకోవాలి ?' జవాబు దొరకని ప్రశ్న మొలకెత్తింది. భారంగా లేచివెళ్లి పక్కమీద వాలి ఆమె గురించి ఆలో చిస్తూ కళ్లు మూసుకున్నాడు.

ఆమె అందంగా వుంది. ఆరో గ్యంగా వుంది. వయసు పాతిక వరకూ వుండొచ్చు. ఆమె చేతులకున్న బంగారు గాజుల్నీ, మెడలో సన్నటి గొలుసునీ బట్టి ఆమెకి ఇంకా పెళ్లి కాలేదు. ఆర్థిక

ఇబ్బందుల వల్ల, తదితర కారణాలవల్ల కాకపోయి వుండొచ్చు. ఇందాకటి తాత మాటల్ని బట్టి వాళ్లూ బ్రాహ్మలే అన్నది స్పష్టమైంది. కాకపోయినా ఫర్వాలేదు. అయితే వంటగదిలో ఆమె అన్నమాటల కర్థమేమిటి? ఆమె భగ్నప్రేమికురాలా? లేక ఎవరైనా పాడుచేశారా? లేక మొగుడు వదిలేసాడా? అలా అయితే పెళ్లయిన సూచన లుండితీరాలి- తత్సంబంధమైన వస్తువులన్నీ తీసిపారేసిందా? ఛీ ఛీ ఆమె అలాంటిది కాదు మరి? ఆమె అవివాహిత ఏది ఏమైనా ప్రస్తుతం ఆమె తండ్రి నీడలో బతుకుతోంది. ఆయన వచ్చేవరకూ వుండి-ఆయన్ని ఒప్పించి ఆమెను పెళ్లి చేసుకుంటే ఆలోచిస్తూనే, ఆమెతో కలిసి మధురమైన భవిష్యత్తును ఊహించుకున్నాడు కాసేపు. ఆ మత్తు వదిలాక ఛీఛీ ఇవేం ఆలోచనలు? ఈరోజు మనసెందుకిలా అయిపోతూందీ ఇదంతా తెలిస్తే ఆమె తనని గౌరవిస్తుందా? ఇంత నీచంగా ఆలోచించడం ఈ మనసుకి ఎలా అబ్బింది? అలాంటి ఆలోచనలు చెలరేగినందుకు మనసుని తిట్టుకుంటూ లేచి కిటికీ తలుపులు తెరిచాడు. సన్నగా గాలి వీస్తోంది. చిన్న శబ్దంచేస్తూ వాన కురుస్తోంది. కిటికీలోంచి ఓసారి బయటకు చూసి కళ్లు మూసుకున్నాడు.

కళ్లలో ఆమె కలలో ఆమె- ఆ అనుభవాలు కలతనిద్రతోనే మిగిలిన రాత్రి గడిచింది సారధికి.

ఉదయం లేచి స్నానం వగైరాలు ముగించుకొచ్చేసరికి టిఫినూ కాఫీ ఇచ్చింది ఆమె.

'ఇంక వెళ్లిపోవాలి' అనుకుంటూంటే మనసు భారమైంది సారధికి. సూట్‌కేస్ సర్దుకుని బయలుదేరాడు. "ఎరి నేను వెళ్లొస్తానండీ అనుకున్న దానికంటె చాలా ఎక్కువగానే ఆదరించారు. ఈ ఆదరణని జీవితాంతంమరిచిపోలేను" అన్నాడు అభిమానంగా చూస్తూ.

ఆమె నవ్వి "నేను చేసింది చాలా తక్కువ. నాన్నగారుంటే ఇంకా ఘనంగా జరిగేది. ఇంత త్వరగా మిమ్మల్ని వెళ్లనివ్వరు కనీసం రెండు మూడు రోజులైనా ఉంచేస్తారు. మంచి మనసున్న మనుషులంటే ఆయన ప్రాణం పెడతారు" అందామె అదోలా ముఖం పెట్టి.

సారధి నవ్వేసి "మీ తమ్ముడింకా లేవలేదా?" అన్నాడు ఆమె గదివేపు చూస్తూ.

"వాడు లేవడానికి ఓ టైమంటూ లేదు. తెల్లారుజామున నాలుగు నుంచి ఎనిమిది లోగా ఎప్పుడో లేస్తాడు. ఇవాళ మబ్బుగా చలిచలిగా వుందిగా ముసుగుతన్ని పడుకున్నాడు" అంది ఆమె కూడా గదిలోకి చూస్తూ.

"ఐసీ సరే వస్తానండీ" అన్నాడు ఆమెకళ్లలోకి చూస్తూ సారధి.


కినీ కవిపించనట్టు నవ్వుతూ తలూపింది ఆమె. బరువుగా అడుగు లేస్తూ మెట్లుదిగి రోడ్డుమీదికి వెళ్లి ఆ యింటిని దాటిపోతూ వెనక్కి చూసాడు సారధి. ఆమె వరండా అంచువరకూ వచ్చి స్తంభానికి అనుకుని నిలబడింది. మెడలోని గొలుసుని పట్టుకుని పెదవులమధ్య ఇరికిస్తూ సారధికేసి నిశ్చలంగా చూస్తోంది. ఆ కళ్లలో ఏదో నిరాశ, నిస్పృహ కొట్టొచ్చినట్టు కనిపించాయి సారధికి. మనసు బరువు మరింత పెరిగింది. గాఢంగా నిట్టూర్చి ముందుకు నడిచాడు. ఇంచుమించు ఇరవై నిమిషాలు నడిచాక రోడ్డు మలుపు తిరుగుతూ ఎదురుగా వస్తున్న ముసలాయన్ని చూసి "రాజేశ్వరావుగారు!" అనుకుంటూ ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరవుతూ టక్కున ఆగిపోయాడు సారధి. ఆయన సారధిని చూస్తూనే గబగబ అడుగులేసుకుంటూ సమీపించాడు. "సారధీ ఏమిటది? ఎక్కడి కొచ్చావ్? ఎక్కడి కెళుతున్నావ్? ఇప్పుడెక్కడుంటున్నావ్? ఎన్నాళ్లయింది నిన్ను చూసి" అనందంగా అంటూ సారధి భుజంమీదుగా ఆప్యాయంగా చెయ్యేసి "అబ్బ నాకెంతో ఆనందంగా వుందోయ్" అన్నారు. ఆయన కళ్లలో కమ్ముకున్న నీటిపొరలు సారధిని కదిలించేసాయి. వంగి ఆయనకి పాదాభివందనం చేసి క్లుప్తంగా ఆయన ప్రశ్నలకి జవాబు చెప్పాడు. అంతా విని నవ్వారు రావుగారు. "ఇప్పట్నుంచీ ఎందుకోయ్ అక్కడికి. ఓ వారం రోజులు మా ఇంట్లో వుండి వెళ్లు. అక్కడికో వారం టైమువుంటుంది నీకు. మరేం ఫర్వా లేదు, కావాలంటే నీ ఫ్రెండ్‌కి నేనొచ్చి నచ్చచెబుతాలే ఇంక ఆలస్యం చెయ్యకు వర్షంవచ్చేట్టుగా వుంది. త్వరగా పద ఇంటికి పోదాం" అంటూ తొందరచేసాడు. ఆయన అభిమాన పూర్వకంగా ఆహ్వానిస్తూంటే కాదనలేక వెనక్కి తిరిగాడు సారధి. ఆయన కనిపించాక మరి సారధికి వెళ్లాలనిపించలేదు, మళ్లీ వెనక్కి వెళితే ఆ యింటిపీ-కనిపిస్తే ఆమెనీ చూడొచ్చనే ఆశకూడా లేకపోలేదు సారధి మనసులో.

సారధి వివరాలూ, ఉద్యోగ విషయాలూ క్షేమసమాచారాలూ తెలుసుకుని ఆనందించి-

"సరస్వతి పోయిందోయ్" అన్నాడు రాజేశ్వరావుగారు తలొంచుకుని నడుస్తూ- తన గురించి కూడా సారధికి అన్నీ చెప్పుకోవాలనిపించి.

"ఎవరూ?" అన్నాడు సారధి అయోమయంగా చూస్తూ.

ఆయన ఓసారి సారధికేసి చూసి "అన్నట్టు ఆ రోజుల్లో నువ్వామెని చూళ్లేదు కదూ సరస్వతి నా భార్య మా అల్లుడి హఠాన్మరణ వార్త విని



గుండె ఆగి చచ్చిపోయింది ఇంతకీ అల్లుడెలా పోయాడో తెలుసా? అతను చచ్చిపోలేదు అతని ఉన్నతిని చూసి ఓర్వలేక అతని అన్న, తమ్ముడూ కలిసి చంపేసారు. అల్లుడు కట్నం తీసుకోలేదన్నది కూడా ఒక నేరంట, వాళ్ల దృష్టిలో. నలుగురిలో తలవంపుల పని చేసాడని ఘర్షణపడి తుదముట్టించేసారు. పెళ్లయిన పదిరోజుల్లోపలే ఈ ఘోరాలు జరిగిపోయాయి. భర్తని మింగేసిన పిశాచపుముండనీ, దరిద్రపు ముండనీ ఆ యింటివాళ్లూ, వూళ్లోవాళ్లూ కలిసి అమ్మాయికి ముద్రవేసేసారు. ఇంక అమ్మాయిని అక్కడుంచడం శ్రేయస్కరం కాదని వెళ్లి తెచ్చేసుకున్నాను. బి.ఏ. చదువుతూండగా దాని పెళ్లి చేసాను. పెళ్లితో చదువాగిపోయింది. బతుకూ బద్దలయింది. అల్లుడూ నా భార్యా పోయిన క్షణం నుంచీ ఇప్పటివరకూ దాని ముఖాన ఓ నవ్వుగాని కనీసం చిరునవ్వుగాని చూసి ఎరగను. ఏ సంఘటనా, ఎవరి మాటా దాని మనసును రంజింప చేయలేకపోతున్నాయి. ఎప్పుడూ విరక్తిగా గంభీరంగా వుంటుంది. దాని తర్వాత వాడు అబ్బాయి. వాడింకా చదువుకుంటున్నాడు. వాడి గురించి నాకే దిగులూ లేదు. కాని అమ్మాయిని చూస్తూంటే గుండె ముక్కలయిపోతూంటుంది. అల్లుడూ నా భార్యా పోయాక ఈ ప్రాంతానికొచ్చి గ్రామంలో హోమియో వైద్యంచేస్తూ కాలం గడుపుతున్నాను." మాటలు ఆపేసి భారంగా నిట్టూర్చాడు రాజేశ్వరరావుగారు.

సారధి మనసులో ఏదో ఆలోచన చెలరేగింది. 'అవునో-కాదో' అనుకుంటూ తన విచారాన్ని వ్యక్తంచేస్తూ రావు గార్ని ఊరడించాడు. ఆయన మామూలు స్థితికి వచ్చాక "మీరేం అనుకోకపోతే నాదొక చిన్న సందేహం" అన్నాడు.


"ఏమిటది?"

"అమ్మాయికి మళ్ళీ పెళ్ళిచేసే ప్రయత్నాలేం చెయ్యలేదా ?"

"ఎలా చెయ్యమంటావ్ ? అలాంటివి జరగడానికి అడ్డంగా కొన్ని కట్టుబాట్లూ, సాంప్రదాయాలూ, మూఢ నమ్మకాలూ వున్నాయి గదా- వాటిని ఉల్లంఘిస్తే సంఘంలో మనకి గౌరవమర్యాద లుంటా యంటావా ?"

"సాంప్రదాయాలూ కట్టుబాట్లూ మానవ కల్యాణం కోసం ఉపయోగ పడాలి. ఇలాంటి అభాగినుల మారణ హోమానికి దోహదంచేసే ఆ సాంప్ర ద్రాయాల్నీ, కట్టుబాట్లనీ మీవంటి విజ్ఞులు కూడా పాటించడం అన్యాయమనిపిస్తోంది. అవన్నీ ఎవరో స్వార్థంకోసం ఏర్పర్చు కున్నవని నా అభిప్రాయం ఎబ్బెట్టుగా మాట్లాడుతున్నందుకు ఏరేం అనుకోకండి. సాంప్రదాయాల్నీ కట్టు బాట్లనీ ఉల్లంఘించడం నేరం, కాని ఓ నిర్భాగ్యురాలిని జీవితాంతం సుఖసంతో షాలకి దూరం చేసి జీవచ్ఛవంలా బతక మనడం నేరం కాదన్నమాట. ఇంక సమాజం గురించి చెప్పాలంటే చాలా వుంది. ఎక్కడ చూసినా స్వార్థం పేరుకు పోయింది. ఎవడిమట్టుకు వాడు ఎడ ఎడంగా బతుకుతున్న రోజులివి. అలాంటప్పుడు ఇలాంటి విషయంలో జోక్యం కలిగించుకునే హక్కు ఎవరికీ లేదు. ఒకవేళ ఎందుకిలా చేసావ్ ? అని ఎవరైనా నిలదీస్తే నా పరిస్థితిలో నువ్వుంటే ఏం చేస్తావో మనస్ఫూర్తిగా ఆలోచించుకుని వచ్చి అడుగు అని జవాబు చెప్పండి మీకంటె చిన్న వాడిని. మీ కింతగా చెప్పడానికి అర్హత లేనివాడిని అయినా చనువుకొద్దీ నాకు తోచింది చెప్పాను. బాగా ఆలోచించండి అంధకారమయమయిన అమ్మాయి జీవితా నికి వెలుగును ప్రసాదించండి. ఆనాడు మీ రందించిన చేయూతవల్ల మీ హృదయ పూర్వక సహాయ సహకారాలవల్ల ఈ నాడు నేను ఉచ్ఛస్థితిలో వున్నాను. ఇలా ఇంకెందరు బాగుపడ్డారో మీ వల్ల. ఇతరుల బాగోగులకోసం తాపత్రయపడే మీ ఉదారత్వాన్ని అమ్మాయి విషయంలో చూపించకపోవడం, ఎన్నో అవక తవకలున్న సంఘానికి వెరచి- ఆమె బతుక్కి వెలుగు చూపే ప్రయత్నం చెయ్యకపోవడం నాకు ఆశ్చర్యంగానే వుంది సార్" అంటూ రావుగారి మొహంలోకి చూసాడు సారధి. ఆ మొహంలోని విషాదాన్ని గమనించి "ఏదో మీ దగ్గర చనువుకొద్దీ హద్దులు మీరి మాట్లాడేసాను. మీ మనసు గాయ పడినట్టుంది, నన్ను క్షమించండి సార్.." అన్నాడు రావుగారి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ సారధి.

"లేదు సారధీ లేదు నీకు తోచింది చెప్పావ్ ఈ మూడేళ్లగా అలాంటి ఆలోచనే లేకుండా- దాన్ని చదివించి బి.ఎ. అయాక ఓ.ఇమ ట్రైనింగుకి




పంపిద్దామనీ ఎక్కడో టీచరుగా ఉద్యోగం చేసుకు బతికే ఏర్పాటు చేద్దామనీ అనుకున్నాను. అమ్మాయి అలాంటివేం చెయ్యనన్నది. ఏం చెయ్యాలో తోచక అలాగే కాలం గడిపేసాను. ఇంక నువ్వు చెప్పినట్టు పెళ్లి ప్రయత్నాలు మొదలెట్టాలి." అంటూ తలెత్తి ముందుకి చూసి "అదిగో అదే మన యిల్లు" అన్నారు రావుగారు వేలితో ఆ యింటిని చూపిస్తూ.

సారధి ఆనందానికి అవధులు లేక పోయాయి.

"ఆ యిల్లా!! రాత్రి నేను బస చేసిం దాయింట్లోనే సార్ అమ్మాయి గారు బంగారంబొమ్మ సార్ మీలాగే ఆమె మనసెంతో చల్లనిది. ముక్కూ మొహం తెలియకపోయినా నన్నెంతో గౌరవించి ఆదరించారు. ఇప్పుడు నాకు మరీ ఆనందంగా వుంది" అన్నాడు. ఈ లోగా ఇల్లు దగ్గరపడింది.

"అయితే నువ్వు అమ్మాయిని చూశావన్న మాట దానిలో ఏ లోపముందని విధి అంతటి కఠిన శిక్ష విధించిందో చెప్పు" అంటూ మెట్లెక్కి "అమ్మా రాధికా" అంటూ తలుపు తట్టారు. సారధి ఏం మాట్లాడలేదు. తను ఊహించినది నిజమైనందుకు ఆనందిస్తూ ఏదో ఆలోచిస్తూ ఆయన్ని అనుసరించి వెళ్లి తలుపుదగ్గర నిలబడ్డాడు. ఆమెని పిలుస్తూ మళ్లీ తలుపుతట్టారు రావుగారు. "ఇదిగో వస్తున్నా నాన్నగారూ కాసేపు నిలబడాలి మరి" అంది రాధిక లోపల నుంచి.

రావుగారు సారధి భుజంమీద చెయ్యేసి గోడకి ఆనుకుని నిలబడ్డారు. రోడ్డుమీద ఎవరో కొందరు అలా వెళుతూ "దండాలు బాబూ" అని పలకరించి వెళ్లారు రావుగార్ని. వాళ్లు వెళ్లాక "నువ్వు చెప్పినట్టు పెళ్లి ప్రయత్నాలు చేస్తాననుకో అసలు పెళ్లికాని ఆడ

పిల్లలకే వేలకి వేలు కట్నాలు పోస్తేకాని పెళ్లిళ్లు కావడంలేదు. అలాంటిది ఓసారి పెళ్లయి మొగుడుపోయిందాన్ని చేసుకోడానికి ఎవరైనా ముందుకొస్తారంటావా?" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"ఓసారి పెళ్లయింది. ఎన్నాళ్లు కాపురం చేసింది? ఏం సుఖపడింది? సరే అదలా వుంచండి. ఇంతకీ మీకు హృదయపూర్వకంగా ఆమెకి పెళ్లి చెయ్యాలనుందా?" అన్నాడు సారధి సూటిగా ఆయన కళ్లలోకి చూస్తూ.

"ఉంది ఎవరైనా చేసుకుంటానంటే తప్పకుండా చేసేస్తాను. నీ మాటలు విన్నాక ఈ సమాజం ఇంత వయసు మీరిన నన్నేంచేస్తుందనే ధీమా వచ్చింది. అమ్మాయి సుఖసంతోషాల కోసం అవసరమైతే నాప్రాణమైనా వదిలేస్తాను." ఆయన కంఠం వణికింది.

"అంత మాటనకండి సార్ మీకేమైనా అయితే నేను భరించలేను. మీ అమ్మాయిని ఎవరు చేసుకుంటారని బాధపడకండి. ఎవర్నో వెళ్లి మీరు అర్ధించాల్సిన అవసరం మీకులేదు."

"అంటే!" ఆశ్చర్యంగా చూశాడు రావుగారు.

"మీకు అభ్యంతరం లేకపోతే, అంగీకారమయితే ఆ అదృష్టాన్ని నన్ను అందుకోనివ్వండి సార్ ఇలా అడుగుతున్నందుకు అన్యథా భావించవద్దని ప్రార్ధన" అన్నాడు బిడియపడుతూ సారధి.

"సారధీ" అరిచారు రావుగారు. "నీకు ఉపకారం చేసానని ప్రత్యుపకారం చేయబోతున్నావా నాయనా- అది నాకు నచ్చదని నీకు తెలిసి కూడా ." ఆయన కంఠం జీరపోయింది. కళ్లలో నీళ్లు మెరిసాయి.

"అదేంకాదు సార్.. బాధపడకండి... అమ్మాయి నాకు అన్ని విధాల నచ్చింది.. ఆమెను చేసుకోవాలని మిమ్మల్ని కలుసుకోక ముందే నిశ్చయించుకున్నాను. నేను మనస్ఫూర్తిగా చెబుతున్నాను ఆమె దక్కకపోతే మీ సారధి మరి బతకడు. ఈ నిర్ణయానికి తిరుగులేదు" అన్నాడు సారధి దృఢంగా.

"సారధీ ." అంటూ అతని రెండు చేతులూ అందుకుని వాటిలో మొహం దాచుకున్నాడు రావుగారు. సారధి చేతులు తడిసాయి. కళ్లు వర్షించాయి.

